అవసరాల నారాయణరావు

# మహానీయుడు

నేనూ, మా ఆవిడ కిచెన్‌లో పడుకుంటాం జంట నగరాల మునిసిపాలిటీ వారు జంటల్ని బెడ్రూంలో పడుకో నీయరు కిచెన్ లోనూ సుఖపడనీయరు !!

మునిసిపాలిటీ వారి చేతుల్లో నల్లాలున్నాయ్.

నల్లాల్లో తాగే మంచి నీళ్లొస్తాయ్. దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది అర్ధ రాత్రి వేళ. ఆంధ్రుల పెళ్లి ముహూర్తాలుండేది అర్ధ రాత్రి వేళ.

నల్లా లొచ్చే శుభవేళ అర్ధ రాత్రి వేళ.

మూడు వందలు పెట్టి ఫ్యావర్‌లూ బజాజ్ అలారం టైంపీస్ కొని పట్టుకు వచ్చాను.

పన్నెండు గంటలకు అలారం పెట్టి పడుకున్నాం.

అలారం కొట్టింది. లేచి వెళ్లి నల్లా తిప్పి వచ్చి కూర్చున్నాం.

ఒంటి గంట... రెండు... మూడు... కళ్లు ఎప్పుడు కూరుకు పోయాయో తెలీదు. ఒళ్లు ఎప్పుడు ఒరిగి పోయిందో ఎరుగం.


మెలకువ వచ్చి, లేచి చూసుకునే సరికి బోర్లించి పేర్చిన బిందెల వరుసకు అటు పక్కన నేనూ, ఇటు పక్క మా స్త్రీ వారూ పడి ఉన్నాం.

నల్లా ఎప్పు డొచ్చి పోయిందో పోయింది.

అలారం టైంపీస్ అంటే పెట్టుకున్న టైముకి కొడుతుంది.

కాని అలారం కొట్టిన టైముకి నల్లా రాదు. నల్లా వచ్చే టైముకి అలారం కొట్టదు. ఈ రెండింటికీ పడదు. ఒకటి యునైటెడ్ ఫ్రంట్. ఇంకొహటి బి.జె.పి.

మూడు వందలు పోసి కొన్న అలారం టైంపీస్‌ని మూలన పడేసి, ఓ కొత్త చిట్కా కని పెట్టింది మా



ఆవిడ.

నల్లా తెరిచి పెట్టేసి దాని కింద ఓ ఖాళీ సీనా రేకు డబ్బా బోర్లించి పెట్టింది.

నల్లా రాంగానే లయబద్ధంగా డ్రమ్స్ వాద్యం వినిపించేది. నీళ్ల ధార ఒత్తిడితో నల్లాలోంచి దభదభా పడి, రేకు డబ్బా డభడభ చప్పుడయ్యేది.

మనిషి గుండె, మంచి నీళ్ల నల్లా ఎప్పుడు ఆగి పోతాయో తెలీదు.

కంగారు పడి పోతూ లేచి, ఒంటి మీద నుంచి జారి పోతున్న బట్టల్ని పైకెగలాక్కుంటూ ఉరుకులు పరుగులుగా నీళ్లు పట్టుకుంటున్నాం.

"ఎన్నేళ్లండీ మనకీ పాక శాల శయనం? రోజంతా చచ్చి చెడి చాకిరీ చేసి చేసి, పట్టుమని ఓ గంట సేపు ఒళ్లు మరిచి హాయిగా నిద్ర పోదాం అంటే లేదు కదా. పక్కమీద నడుం వాల్చి నప్పటి నుంచీ ఎప్పుడు నల్లా వస్తుందో, ఎక్కడ నిద్ర పట్టి పోతుందో అనే బెంగే 'నల్లా నల్లా! అని ధ్యానిస్తూ 'నీళ్లు నీళ్లు!' అని స్మరిస్తూ తెరుపూ మరుపుగా పడుకోవటం.

కొన్నాళ్లు పోతే, మనల్ని ఎర్ర గడ్డ మెంటల్ హాస్పిటల్‌లో చేర్పించాల్సి వస్తుంది. అక్కడ మిట్ట మధ్యాహ్నం వేళ లేచి "ఇదిగో అర్ధ రాత్రి అయిపోయింది. అదిగో నల్లా వస్తోంది. నీళ్లు పట్టాలి, లే!" అంటూ మీరు నర్సు రెక్కలు పట్టుకునీ, నేను డాక్టరు తెల్ల కోటు పట్టుకునీ గుంజుతాం. అప్పుడు డాక్టరు మన ఇద్దరికీ చెరో మత్తు ఇంజక్షనూ పొడిచి, "ఇదిగో సిస్టర్! ఈ నల్లా పేషెం ట్లిద్దర్నీ తీసికెళ్లి ఆ వాష్ బేసిన్ దగ్గర బెడ్ మీద పడుకోబెట్టు" అంటాడు. మన బ్రతుకులు అలా తెల్లార్రి పోతాయ్. ఆఖరికి, మన ఆత్మ శాంతి కోసం మన పిల్లలు మన సమాధుల మీద ఇద్దరికీ చెరో నల్లా అమర్చ వలసి వస్తుంది!"

నల్లాపుణ్యమా అని, మనసు గతుల్ని లోతుగా అధ్యయనం చేసింది మా ఆవిడ!

"అయితే, ఇప్పుడు నన్నేం చెయ్యమంటావే?'

"వంట గదిలో పెట్టుకుందుకి ఇరుకైతే అయింది ఏం చేస్తాం మరి తప్పని సరి అయినప్పుడు, ఓ ఫుల్ సైజ్ డ్రమ్ పెద్దది కొనిపట్టుకు రండి. దాంతో పాటు రెండు మూడు లీటర్ల పోలి ఎథిలిన్ పైపు కూడా కొని తీసుకు రండి. పడుకోబోయే ముందు నల్లా తెరచి ఉంచేసి పైపు ఇటు పక్క కొసను నల్లా తలకు తగిలించి, అటు పక్క కొసను డ్రమ్‌లోకి వదిలేద్దాం. ఎంత సేపు నల్లా వస్తే అంత సేపూ నీళ్లు వస్తాయ్. మనం ఎంచక్కా హాయిగా బెడ్రూంలో ఏ ఫికరూ లేకుండా పొద్దెక్కే దాకా పడుకో వచ్చు!"

మా ఆవిడ క్రీగంటి చూపుల్లో నాకు ఓ బోనస్ సందేశం!

***

సికిందరాబాద్ జనరల్ బజార్లో ఓ పెద్ద డ్రమ్ కొని, రిక్షా బేర మాడుతున్నాను.

రిక్షా వాడు ముప్ఫయ్ అయిదు అడుగుతున్నాడు. నేను ఇరవై అయిదు ఇస్తానంటున్నాను.

"తక్కువ దూరం ఉందా సారూ? అంతా చెడావే నాయె" వాడు గునుస్తున్నాడు.

"గిరాకీకి ఇంత సామాను ఉంటే చాలు, మీరు చెట్టెక్కి కూర్చుంటారు" నేను గొణుక్కుంటున్నాను.

"అంకుల్! దీన్ని నేను మోసుకు వస్తాను."

అప్పుడే మొక్క నుంచి తుంచిన లేత బెండ కాయ మీద ఉన్న నూగు లాంటి లేలేత మీస కట్టుతో ఉన్న ఓ పదిహేడేళ్ల టీనేజర్ నా ముందు కొచ్చి నించున్నాడు.

మొహంలో నీరసం కొట్టవచ్చినట్లు కనిపిస్తోంది. కను రెప్పలు బరువుగా వాలి పోతున్నాయ్. తిండికీ, నిద్రకీ మొహం వాచినట్లున్నాడు.

చేతుల దగ్గర చిరిగిన చొక్కా.

అతుకులు వేసి కుట్టిన ప్యాంట్.

మాట   ందీ భాషలో ఓ తరహా ప్రత్యేక యాస.

స్థానికుడిలా అనిపించ లేదు నాకు.

"నీ వల్ల కాదురా అబ్బాయ్. రిక్షా కావాలి నాకు" అన్నాను హిందీలో.

"నేను మోసుకు రాగలను అంకుల్. మీ కెంత తోస్తే అంతే ఇవ్వండి. ఇంతే ఇచ్చారేం అని నేను అడగను."

దీనంగా మొహం పెట్టి ప్రాధేయ పడ్డాడు.

కడుపులో ఆకలి నకనక లాడుతూన్నట్లుంది. ఏమైనా కొనుక్కు తినటానికి జేబులో పైసలు ఉండి ఉండవ్.

జాలేసింది నాకు.

"చూడు బాబూ! మా ఇల్లు ఇక్కడికి సుమారు పది కిలో మీటర్ల దూరం ఉంటుంది. ఈ డ్రమ్‌ను నువ్వు తల మీద పెట్టుకుని అంత దూరం మోసుకు రాలేవ్...

"ఇహ నా మాట అంటావా? నేను కుర్రాణ్ణి కాదు. డెబ్బయ్ ఏళ్లు వచ్చి మీద పడ్డాయ్. ఇంత మండుటెండలో అంత దూరం కాలి నడకన నీతో వచ్చే ఓపిక లేదు నాకు. నువ్వో ఇంకో బేరం ఏదైనా చూసుకో. నన్ను రిక్షాలో పోనీయ్. ఈ రెండు రూపాయలూ ఉంచుకో. ఏ అరటి పళ్లో కొనుక్కు తిను."

జేబులోంచి రెండు రూపాయల నోటు తీసి చేతిలో పెట్టబోయాను.

"వొద్దు అంకుల్! మీకు ఏ సేవా చెయ్యకుండానే పైసలు పుచ్చుకోవటం యాచన అవుతుంది. నేను యాచనకు రాలేదు. నేను మోసుకు వచ్చిన తర్వాత ఏదైనా ఇవ్వండి. మీ ఇష్టం ప్లీజ్ !"

ఓ పక్క అలా అంటూనే ఇంకో పక్క చొరవగా డ్రమ్ముని నెత్తికి ఎత్తేసుకున్నాడు.

కుర్రాడు అభిమానధనుడు! అపరాధ మానసంతో చిన్న బుచ్చుకున్నాను.

"ఒద్దు దించెయ్... నువ్వు నా కక్కర్లేదు పో!... నేను రిక్షాలోనే పోతాను" అని నేను మొండి కేసుక్కూర్చోవటం మూర్ఖంగా ఉంటుంది. మొరటుగా, అనాగరికంగా అనిపిస్తుంది.

జీవితంలో మనిషి అప్పు డప్పుడు ఇష్టం ఉన్నా లేక పోయినా, నాజూకుతనానికి తల ఒగ్గక తప్పదు.

ఓ అర్ధ రాత్రి వేళ ముక్కూ మొహం తెలీని ఓ మహిళ వచ్చి మీ తలుపు తడుతుంది. "అయ్యా మాది బాల్‌హార్షా! మీ పక్క వాళ్ల ఇంటికి వచ్చాను. తీరా చూస్తే వాళ్ల తలుపులు తాళం వేసి ఉన్నాయ్. ఊరికి వెళ్లారో ఏమో ఈ రాత్రికి మీ ఇంట్లో దయ చేసి నన్ను కాస్త తల దాచుకోనిస్తే, తెల్లవారంగానే లేచి వెళ్లి పోతాను" అంటుం దనుకోండి. అప్పుడు

## కిటుక్కు

**వార్నిష్ పెయింట్ చేసిన గోడలను వెనిగార్ నీళ్లతో తుడిస్తే, అవి కొత్తగా మెరుస్తుంటాయి.**

మీరూ ,మీ స్త్రీ వారూ ఏం చేస్తారు?

మా పొరుగున ఇన్ని ఇళ్లు ఉన్నాయ్. మా ఇల్లే కావలసి వచ్చిందేమిటి? సిటీలో బోలెడు హోటల్స్, లాడ్జింగ్ హౌసెస్ ఉన్నాయ్. వాటిలో, ఓ గది కిరాయికి తీసుకుని అందులో ఉండ వచ్చు కదా. నువ్వు ఎవరివో, ఏమో, నీ ముక్కూ మొహం మాకు తెలీదు. నీ వెనకాల ఏ నేర చరిత్ర ఉందో. ఏం పాడో? మాకెందుకూ ఈ పీడ?" అని తరిమి కొట్టేస్తారా? లేక అయ్యో! వేళ కాని వేళ అసహాయురాలైన ఓ ఆడది వచ్చి ఆశ్రయం కోరుతోందని ఇస్తారా? ఏం చేస్తారు చెప్పండి?

నాజూకుతనానికి తల్లొగ్గి "సరే అయితే పద. చాలా దూరం స్మా! మరోసారి ఆలోచించుకో!" అని మళ్లీ ఇంకో సారి హెచ్చరించాను.

"పర్వాలేదు అంకుల్ పదండి!"

నేను జేబు లోంచి చేతి రుమాలును తీసి నెత్తి మీద పరుచుకున్నాను.

వరదలో పడి కొట్టుకు పోతూంటే దర్భ గడ్డి రక్షిస్తుందా?

నా పిచ్చి భ్రమ కాని మే నెలలో మిట్ట మధ్యాహ్నం అగ్ని గోళంలా మండిపోతున్న ఆ మార్తాండుడికి నా జేబు రుమాలు ఒక లెక్కా?

అడుగులో అడుగు వేసుకుంటూ, ఆ కుర్రాడి పక్కనే నడుస్తున్నాను.

పది గజాల దూరం వెళ్లామో లేదో ఒకటే నీరసం. ఒళ్లంతా చెమట కారి పోతూంది. అడుగు తీసి ముందుకి అడుగు పడటం లేదు. ఇంత నీడ కనిపిస్తే చాలు పోయి ఆ నీడలో కూర్చుందామా అనిపిస్తోంది.

'నువ్వెందుకు మొహమాట పడాలి? ఆఫ్టరాల్! ఆ కుర్రాడికీ నీకూ ఏం సంబంధం? వాడి కోసం ఈ వయసులో ఇంత ఎండలో అంత దూరం నడవటానికి ఎందుకు సిద్ధ పడాలి? ఇలాంటి కుర్రాళ్లు దేశంలో ఎంత మంది లేరు? జాలి పడి ఎంత మందిని ఆదుకోగలం?'

నా లోపల్నుంచి ఎవరో నన్ను అజ్ఞాతంగా చీవాట్లు పెడుతూన్న ట్లనిపించింది.

ఇహ ఆ కుర్రాడి అవస్థ చూడాలి. బరువుకి, మెడ నొప్పెడుతూ న్నట్లుంది. పది అడుగుల కో సారి నెత్తి మీంచి డ్రమ్మును కిందికి దించుకుంటున్నాడు. నరాలు సర్దుకునేలా మెడను ఓ సారి అటూ ఇటూ విసురుకుంటున్నాడు. ఉస్సురస్సు రంటున్నాడు. మొహం మీద కారుతూన్న చెమటను తుడుచుకుందుకి చేతి రుమాలు లేక కొంచెం ముందుకి వంగి, చొక్కా కింది భాగాన్ని పైకెత్తి దాంతోటే మొహం తుడుచుకుంటున్నాడు.

"చూశావా బాబూ! ఎంత అవస్థ పడుతున్నావో? అందుకే వద్దన్నాను. ఇప్పటి కయినా మించి పోయిందేమీ లేదు. ఈ అయిదు రూపాయలూ తీసుకుని నీ దారిన నువ్వు వెళ్లిపో. నా దారిన నేను వెళ్లి పోతాను."

అయిదు రూపాయల నోటు తీసి చేతిలో పెట్టబోయాను.

"పర్వాలేదు అంకుల్!.. పదండి!"

దించిన డ్రమ్మును మళ్లీ నెత్తికెత్తుకున్నాడు.

నేను వద్దు వద్దని వారిస్తున్నా ఆ కుర్రాడు కారణం ఏమిటో నాకేమీ బోధ పడ లేదు.

"ఏం పేరు బాబూ, నీపేరు?" సరసనే నడుస్తూ అడిగాను.

"పురన్ సింగ్ అంకుల్!"

"నిన్ను చూస్తోంటే, యిక్కడి వాడివిలా కనిపించటం లేదు. ఏ ప్రాంతం వాడివి?"

"మాది రాజస్థాన్. జైసల్మీర్ జిల్లా."

'అంత దూరం నుంచి ఇక్కడికి ఎందుకు వచ్చినట్లు?'

నేను రెండు మూడు సార్లు రెట్టించినా ఆ కుర్రాడు సమాధానం చెప్ప లేదు.

"ఏం?... తల్లీ, తండ్రీ ఏమైనా మందలిస్తే ఇంట్లోంచి చెప్పాపెట్టకుండగా పారి పోయి వచ్చేశావా?"

ముసుగులో గుద్దులాట ఎందుకని, సూటిగా అడిగేశాను.

జలగలా యీ ముసలి పీనుగ నన్ను పట్టుకుని వదిలి పెట్టేటట్లు లేదు అనుకున్నాడో ఏమో!

"అవును అంకుల్!"

నేనడిగినంత సూటిగానూ, ధైర్యంగానూ చెప్పాడు.

"నయా పైసా సంపాదన లేదు. గడ్డాలూ మీసాలూ వస్తున్నాయ్. కూర్చుని తింటున్నావ్. సిగ్గుగా లేదురా నీకూ?... ఇలా ఒక తిట్టు కాకుండగా తిట్టి పోశాడు మానాన్న. నాకు బాధ కలిగింది. ఉక్రోషం వచ్చింది. అంతే, వెంటనే ఇ ల్లొదిలేసి వచ్చేశాను."

'ఎంత పని చేశావ్?... పెద్ద వాళ్లు నీ మంచి కోరి ఓ చిన్న మాట అంటారే అనుకో. అంత మాత్రాన చెప్పా పెట్టకుండగా యిల్లొదిలి యిలా పారి పోయి వచ్చేస్తావా? నువ్వు కనిపించక, నిన్ను కన్న తల్లి ప్రాణం ఎంత తల్లడిల్లి పోతుందో ఆలోచించావా? నీ మీద కొండంత ఆశ పెట్టుకున్న నా తండ్రి ఎంత కుమిలి పోతూ వుంటాడో అర్థం చేసుకున్నావా?'

"ఇక్కడకు వచ్చాక, క్షేమంగా వుంటూన్నట్లు ఉత్తరం రాశాను."

"మరి, నీ ఎడ్రెసూ అదీ యిచ్చేవా?"

"ఎడ్రెస్ అంటూవుంటే కదా యివ్వడానికి?"

"మరి యిక్కడ ఏం చేద్దామని?"

"ఏదైనా నౌఖరీ చూసుకుంటాను."

"నువ్వు ఏం చదువుకున్నావ్?"


"టెన్త్ ఫెయిల్ అయ్యాను."

"మరి నౌఖరీ దొరుకుతుందని నమ్మకం వుందా?"

"ఒళ్లొంచి పని చెయ్యటానికి నడుం కడితే ప్రయత్నం చెయ్యగా చిన్నదో, చితకదో దొరక్కపోదు."

ఆత్మాభిమానం ఎంత వుందో, ఆత్మవిశ్వాసంకూడా అంతే వుంది కుర్రాడిలో.

అభినందించకుండా వుండ లేక పోయాను.



"మీ తండ్రి గారి కేం పని?"

"టైలర్."

"అప్పచెల్లెళ్ళూ, అన్నదమ్ములూ ఎంత మంది?"

"ఒక చెల్లీ, ఒక తమ్ముడు."

"ఇక్కడ ఎక్కడ వుంటున్నావ్?"

"ఉన్న వాడికి ఒకేచోటు. నాకు రెండు ఉన్నాయ్."

తల తిప్పి, అయోమయంగా ఆ కుర్రాడి మొహంలోకి ప్రశ్నార్థకంగా చూశాను.

"పగ లంతా రోడ్ల మీద, రాత్రంతా షట్టర్స్ దించేసిన షాపుల ముందున్న గట్ల మీద!"

ఆ కుర్రాడి సమాధానం తీరు, ఎందుకోగాని, నాకు ముచ్చ టనిపించింది.

కబుర్ల ధోరణిలో కాలం, కష్టం కూడా తెలీ లేదు. దూరం తరిగిపోయింది. ఇల్లు చేరుకున్నాం.

మా గుమ్మం ముందున్న మెట్లు ఎక్కబోతుంటే నా కాళ్లు తేలి పోతున్నాయ్. ఒళ్లు తూలి పోతోంది. చొక్కా అంతా చెమటతో తడిసి ముద్దయి పోయింది. దాహంతో నోరు పిడచ కట్టుకుపోయింది. కడివెడు చల్లటి మంచి నీళ్లు తాగి, నేల మీద ఎప్పుడు నడుం వాలుద్దామా అనిపించింది నా మటుక్కి.

ఇహ, పురన్ సింగ్ డ్రమ్ నెత్తి మీది నుంచి దించి, కాస్సేపటి దాకా మెడను అటూ యిటూ తిప్పలేక పోయాడు. అది కొయ్య బారి పోయింది. గుమ్మం మెట్ల మీద చతికిలబడి పోయాడు. చొక్కా కింది భాగాన్ని పైకెత్తి దాంతో చెమట కారుతూన్న మొహం, మెడ తుడుచుకున్నాడు.

"మీ కేమన్నా మతి పోయిందా?... ఇంత ఎండలో నడుచుకుంటూ వస్తారా? వడ దెబ్బ కొడితే ఏమై పోతారో ఆలోచించుకున్నారా?"

కందగడ్డల్లా వున్న మా ముఖాలను చూసి, మా ఆవిడ వాచి పోయేలా చివాట్లు పెట్టి, రెండు పెద్ద చెంబుల్తో చల్లటి మంచి నీళ్లు పట్టుకొచ్చి యిద్దరికీ అందించింది.

ఆ నీళ్లతో మొహాలు కడుక్కుని, యింకో రెండు చెంబుల నీళ్లు తాగే దాకా మా యిద్దరికీ నోట మాట రాలేదు.

"నేను వెళ్తాను అంకుల్!"

కొంచెం ప్రాణం కుదుట పడ్డాక అన్నాడు పురన్ సింగ్.

'ఎండ బడ్డావ్. అలసి పోయావ్. ఇన్ని మెతుకులు తిని విశ్రాంతి తీసుకుని, సాయంత్రం చల్లపడ్డాక వెళ్లదువు గానిలే.'

తెల్లబోయి, నా మొహంలోకి చూశాడు పురన్ సింగ్.

కూలి పైసలు యిచ్చేసి పొమ్మంటానని అనుకున్నాడో ఏమో మరి.

డైనింగ్ టేబిల్ మీద మా యిద్దరికీ చపాతీలూ, ఆలూ సబ్జీ, అన్నం, సాంబారూ వగైరాలు వడ్డించిన ప్లేట్లూ, కటోరీలూ పెట్టింది మా ఆవిడ.

బలవంతం చెయ్యగా వచ్చి కూర్చున్నాడు కాని, ఎందుకో యిబ్బంది పడుతున్నాడు తినటానికి.

'ఆఫ్టరాల్ నేను చూస్తే ఓ కూలీ గాణ్ని, ఈయన తనతో సమానంగా తన సరసన కూర్చోపెట్టుకుని యిలా డైనింగ్ టేబిల్ మీద భోజనం చెయ్య మంటున్నాడు.'

ఇలాంటి మీమాంసే ఏదో అతగాణ్ని యిబ్బంది పెడుతూన్న ట్లనిపించింది నా మటుక్కి.

"పరవా లేదు పురన్!.... ఏ ఆలోచనా పెట్టుకోకు. భోజనం చెయ్."

ఇలా ఒకటి రెండు సార్లు హెచ్చరించగా, ఎలాగో నాలుగు మెతుకులు తిన్నాడు.

డ్రాయింగ్ రూమ్‌లో చాప వేసి, దిండు పెట్టి, ఫ్యాన్ వేసి పడుకో మన్నాను.

ఒక పక్క తిన్న ఎండ దెబ్బ, యింకో పక్క పడ్డ అలసట కారణంగా నడుం వాల్చీ వాల్చగానే, ఒళ్లు తెలీకుండా నిద్ర పట్టేసింది పురన్ సింగ్‌కి.

సాయంత్రం అయిదు అవుతూంది. లేచాడు పురన్ సింగ్.

బాత్‌రూమ్ కెళ్లి కాళ్లూ, చేతులూ, మొహం కడుక్కుని వచ్చాడు.

ఓ ప్లేట్లో దూధ్ పేడా, రెండు అరిసెలూ, యిన్ని జంతికలూ పట్టుకొచ్చి అందించింది మా ఆవిడ.

ఇబ్బందిగా అందుకుని, మొహమాట పడుతూనే తిన్నాడు. చాయ్ తాగాడు.

మీ పేర్లూ, చిరునామా అన్నీ మా అమ్మాయ్ తాయ్‌ని అడిగి రాయించి పుచ్చుకున్నాడు.

ఇహ వెళ్లి పోవటానికి సిద్ధ పడుతూన్నప్పుడు చేతిలో పది రూపాయలు పెట్టబోయాను.

పుచ్చుకోలేదు పురన్ సింగ్.

నేనే జేబులో కుక్కాను బలవంతాన.

"మధ్య మధ్య వస్తూండు పురన్."

"తప్పకుండా అంకుల్!"

మా ఆవిడకు దణ్ణం పెట్టాడు.

నా పాదాలను స్పృశించి కళ్లకు అద్దుకున్నాడు.

"వస్తాను తాయక్కా!"

మెట్లు దిగి వెళ్లి పోతూ చెప్పాడు పురన్ సింగ్.

ఆవేళ రాత్రి పడుకున్నా నన్నమాటే కాని, కంటికి కునుకు పట్ట లేదు.

మనసు నిండా పురన్ సింగే.

అతగాడి విషయంలో ఎక్కడో ఏదో పెద లోపం నా వల్ల జరిగింది అనే ఒక తరహా అపరాధ భావం ఎందుకో గాని, నా మనసులో కుమ్మరి పురుగు దొలిచినట్లు దొలిచేస్తోంది.

"కడుపు కాలి, అంతటి మండుటెండలో కష్టమైనా అంత బరువును మోసుకు వచ్చిన ఆ పసి వాడి చేతిలో ముష్టిపదిరూపాయలు పెడతావా. నీ లేకితనం మండ!" నా అంతర్వాణి తిట్టి పోసింది.

'రిక్షా వాడు ముప్పయ్ అయిదు అడిగాడు. ఉదారంగా ఆ ముప్పయ్ అయిదూ యిచ్చి పంపించ వచ్చుగా. నువ్వు యిరవై అయిదు యివ్వటానికి సిద్ధ పడ్డావ్. కనీసం ఆ యిరవై అయిదయినా యిచ్చి పంపించ వచ్చుగా. ముష్టిపది రూపాయలు వాడి చేతిలో పెట్టి, మిగతా పదిహేను రూపాయలూ ఆదా చెయ్యా లనుకున్నావ్....'

"నేను నడిచే వచ్చాను. పైగా తిండి పెట్టాను. ఫలహారం యిచ్చాను. చాయ్ పోశాను. ఈ పది రూపాయలే ఎక్కువ!" - ఇవే నీ దిక్కుమాలిన ఏకనామిక్సు! ఈ తర్కం నేపథ్యంలోనే ఆ పది రూపాయలూ పెట్టావ్ వాడి చేతిలో.

'కుంచించుకు పోయిన హృదయం నీది. మూసుకు పోయిన మనసు నీలో వున్నది. వయసుకు తగ్గ పరిణతి లేదు నీలో!'

నా అంతరాత్మ ఘోషకు నా గుండె బరు వెక్కి పోయింది. నా మన సంతా వికలమై పోయి విలవిల తన్నుకుంది.

## జోక్

ఇంటర్వ్యూకి హాజరైన ఓ అమ్మాయి... అధికారి అడిగిన ప్రశ్నలకు జవాబులు చెప్పలేక... బావురుమని ఏడ్చింది.

'బాబోయ్... నువ్వు అలా ఏడవకు! బయట జనం అపార్థం చేసుకుంటారు!' అని కంగారు పడిపోయాడు ఆ అధికారి.

**చిదానందం**

'ఆత్మాభిమానం, ఆత్మవిశ్వాసంతో ఏదైనా కష్టం చేసుకునే బ్రతకాలి గాని యాచించ కూడదు అనే సిద్ధాంత నిబద్ధతకూ, ఉన్నతమైన విలువలకూ కట్టుబడి, కష్టంలో వున్న ఓ పసి వాడికి అన్యాయం చేశాను.'

తల తీసేసిన ట్లనిపించింది నాకు. తీరని అవమాన భారంతో మానసికంగా క్రుంగిపోయాను.

అంతరాత్మ పెట క్షోభ, అన్ని న్యాయ స్థానాలూ విధించ గలిగే కఠినాతి కఠినమైన శిక్ష కంటే దుర్భరం!

***

పురన్ సింగ్ వెళ్లి, అయిదు నెల లైంది.

'ఎలా వున్నాడో ఏమో? ఎక్కడైనా, ఏదైనా నైఖరీ దొరికిందో లేదో? అస్సలు యీ వూళ్లో ఉన్నాడో, లేక వాళ్ల వూరు వెళ్లి పోయాడో?' - ఇలా మా యింటిల్లిపాదీ పురన్ సింగ్‌ని తల్చుకోని రోజు లేదు.

'రాక పోతే, పోనీ, వుత్తరం ముక్కయినా రాశాడు కాదు?' నేను గొణుక్కుంటూ వుండే వాణ్ని.

ఆ వేళ కూడా అలాగే అనుకుంటూ వుండగా పోస్టులో ఉత్తరం. అది హిందీలో వుంది.

"అంకుల్!

మీకూ, చాచాకీ, అక్కకీ నా నమస్సుమాంజలి.

మీరంతా కులాసాగా వుంటున్నట్లు తలుస్తున్నాను.

నగర శివారుల్లో వున్న చిన్న పారిశ్రామిక వాడ అయిన కటెదాన్‌లో శారదా రబ్బర్ వర్క్స్ అనే ఫ్యాక్టరీలో నాకు చిన్న నౌఖరీ దొరికింది.

నెలకు అయిదు వందలు జీతం, యజమాని అంగీకారంతో, ఫ్యాక్టరీ ఆవరణలోనే ఓ చిన్న గుడిసె వేసుకున్నాను. రెండు పూటలకూ సరి పడ్డ పరోటాలు ఒత్తుకుని, వాటిలోకి చేతనైనట్లు యింత సబ్జీ చేసుకుని, యిన్ని చాయ్ నీళ్లు కలుపుకుని తాగి హాయిగా బ్రతికి పోతున్నాను.

మూడు వందల రూపాయలు యింటికి ప్రతి నెలా పంపుతున్నాను.

ఆ వేళ, మీరూ, చాచీ, అక్క నా పట్ల చూపించిన ఆదరణ, ఆప్యాయతా నేను నా జన్మలో మరచి పోలేను. మీ ఋణం నేను తీర్చుకో లేను.

సాధ్య మైనంత త్వరలో ఓ సెలవు రోజు చూసుకుని మీ దర్శనార్థం వస్తాను. ప్రతీ రోజూ, ఆదివారం కూడా ఓవర్ టైమ్ చేస్తుండటం వలన ఎక్కడా వూపిరి సలపటం లేదు.

సెలవ్,

మీ పురన్!"

మా దగ్గర తీసుకున్న ఎడ్రెస్ కాగితాన్ని యిన్నాళ్లూ యింత పదిలంగా దాచుకుని, కృతజ్ఞతలు కురిపిస్తూ ప్రత్యేకంగా వుత్తరం వ్రాశాడు. అంటే ఆ కుర్రాడి సభ్యత, సంస్కారం ఎటువంటివో వూహించుకో గలిగాను. ఇంటికి మూడు వందలు నెలనెలా పంపిస్తున్నా డంటే అందులో ఎంత బాధ్యతాయుత వైఖరి వుందో గ్రహించ గలిగాను.

సంబరంతో పొంగి పోతూ, మనసారా ఆశీర్వదిస్తూ ఆ వేళే పోస్టులో పోయేలా జవాబు రాసి పడేశాను.

***

ముందు గదిలో యీజీ చెయిర్లో పడుకుని, వెనక్కి వాలి రెండు కాళ్లనూ ఎదురుగా వున్న స్టూలు మీద పెట్టి, న్యూస్ పేపర్‌ను చేత్తో పైకెత్తి పట్టుకుని చదువుకుంటున్నాను.

"ప్రణామ్ అంకుల్!..."

చేతిలో వున్న న్యూస్ పేపర్‌ను పక్కకు తప్పించి చూశాను.

ఎదురుగా, నా పాదాలను స్పృశించి కళ్ళకద్దుకుంటూ వేస్తూన్న పురన్ సింగ్!

"హల్లో పురన్! ఇదేనా రావటం!? క్షేమంగా వుంటున్నావా?"

ఆప్యాయంగా, భుజం తడుతూ నా పక్కనున్న కుర్చీలో కూర్చోపెట్టుకున్నాను.

"ఏమేవ్!... పురన్ వచ్చాడు, జల్దీ చాయ్ పట్టుకురా!"

కుర్చీ లోంచే లోపలికి వినపడేలా అరిచాను.

"ఏం బాబూ కులాసాగా వున్నావా?"

సాసర్లో యిన్ని బిస్కట్లూ, కప్పుతో చాయ్ పట్టుకు వచ్చి అందిస్తూ పలకరించింది మా ఆవిడ.

"మీ అందరి దయం వల్ల, బాగానే వున్నానమ్మా!... తాయ్ అక్క ఏదీ?"

"హల్లో పురన్ భాయ్!... బాగున్నావా? ఉద్యోగం దొరికిందట కదా, చాలా సంతోషం."

పెరట్లోంచి వస్తూనే మా అమ్మయ్ తాయ్ పురన్ సింగ్‌ని పలకరించింది.

"బాగానే వున్నాను అక్కా! ఈ వేళ రాఖీ పండగ. మాకు సెలవు యిచ్చారు. నా అదృష్టం బాగుండి, యీ వేళ కార్ఖానా పూర్తిగా బంద్ చేసేశారు. ఎగిరి గంతేశాను అంతే! ఇక్క డొచ్చి పడ్డాను."


భుజాన వేలాడుతున్న సంచీ లోంచి చూట్టానికి ఎంతో ముచ్చటగా వున్న ప్రొద్దు తిరుగుడు పువ్వంత రాఖీని తీసి, మా తాయ్ చేతికి కట్టగా, ఆమె చేతిలో వంద రూపాయల నోటు కుక్కాడు.

మళ్లీ సంచీలో చెయ్యి పెట్టాడు.

"ఇవి మీ యిద్దరికీ అంకుల్!"

ఓ పంచల చాపూ, చీర నా చేతిలో పెట్టాడు.

ఓ మహనీయుడి ముందు నా పతన వలయం పూర్తయిన ఆఖరి క్షణం అది!




## అంకితం

**ప**దేళ్ల క్రితం, మే నెల పద్దెనిమిదో తారీఖున అనుకోకుండాకేవలం ఒక కూలీగా నాకు పరిచయమై మనిషి మనసు, సైజు, వయసు నిష్పత్తిలో వుండవని చాటి చెప్పి గురువుగా నా మనఃఫలకం మీద చెరగని ముద్ర వేసుకుని నిలిచి పోయిన ఆ రాజస్థానీ చిరంజీవికి యీ రచన అంకితం.